Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

గురువారం 01/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## చంద్రబాబు సభాస్థలి వద్ద పేలిన గ్యాస్ సిలిండర్



**టీ మీడియా, సెప్టెంబర్ 30 ,విజయవాడ :**
ముఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగ సభ సమీపంలో భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియం సమీపంలో ఇవాళ సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలడంతో సభలో ఉన్న వారు ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన పోలీసులు క్షణాల వ్యవధిలో స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.సభాస్థలికి కూతవేటు దూరంలోని ఓ నిమ్మకాయ సోడా బండి వద్ద ఉన్న గ్యాస్ సిలిండర్ పేలినట్టు పోలీసులు పేర్కొన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటం వల్ల సిలిండర్ పేలినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. పేలుడు ధాటికి సిలిండర్ సుమారు 60మీటర్ల దూరంలోని విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో ఆప్రాంతంలో ఒక్కసారిగా కరెంట్? సరఫరా నిలిచిపోయింది. పోలీసులు భద్రతా చర్యలు తీసుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# సిరిసిల్ల గడిని నేలమట్టం చేద్దాం

**⏭ ఇదే మన ప్రతిజ్ఞ**
**⏭ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**⏭ భారీ ఎత్తున పాదయాత్ర, ర్యాలీగా సభకు**

**టీ మీడియా, సెప్టెంబర్ 30 ,రాజన్న సిరిసిల్ల :**
ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉత్సాహంగా సాగింది. కేటీఆర్ అడ్డాలో తమ బలాన్ని నిరూపించేలా కీలక నేతలు, శ్రేణులు, నేతన్నలతో సీఎం మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు లక్ష్యంగా కొంతకాలంగా పదునైన ఆరోపణలు చేస్తూ వస్తున్న రేవంత్ రెడ్డి... ఇవాళ తన విమర్శలు పదును మరింత పెంచారు. సిరిసిల్ల వాసులకు జరిగిన అన్యాయం, బీఆర్?ఎస్ పాలనతో జరిగిన నష్టాన్ని వివరిస్తూ జోరుగా విమర్శలు ఎక్కుపెట్టారు.బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, స్థానికులు, జిల్లా వాసులతో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని మనసులో మాట వెల్లడించారు. సిరిసిల్ల చేనేత కష్టాలు, కాళేశ్వరం ముంపు సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి



ప్రసంగం సాగింది. 2009 నుంచి కేటీఆర్‌ను సిరిసిల్ల ప్రజలు గెలిపించారని, అయినా ఆయన నేతన్నల ఆత్మహత్యలను ఆయన ఎందుకు



ఆపలేకపోయారని, గల్ఫ్‌కు వలసపోతున్న కార్మికులను ఎందుకు ఆపలేకపోయారని నిలదీశారు.మీ కుటుంబాలను ఆదుకోవడానికి అణాపైసా సాయం చేయలేదని, ఒక్క రోజైనా కేసీఆర్ కుటుంబం మీ గురించి ఆలోచన చేసిందా? ప్రజలను రేవంత్ అడిగారు. కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని ఉద్యమానికి ఊపిరి పోసింది కరీంనగర్ జిల్లా కాదా? ప్రశ్నించారు. 2009లో కరీంనగర్‌ను వదిలి పాలమూరుకు ఎందుకు వలస వచ్చారని, కరీంనగర్ ప్రజలను కేసీఆర్ వంచించి, మోసగించారని నిలదీశారు. మానేరు వాగులో గోయ్యి తీసి పాతి పెడతామంటే కేసీఆర్ పాలమూరుకు పారిపోయి వచ్చారని, అక్కడ కేసీఆర్‌ను గెలిపిస్తే రాష్ట్రం వచ్చాక మమ్మల్ని వంచించారని తెలిపారు. మమ్మల్ని కృష్ణా నదిలో ముంచి గజ్వేల్‌కు పారిపోయి వచ్చారని, మా వలసలు, ఆత్మహత్యలు ఆగలేదని, మా జీవితాల్లో వెలుగు రాలేదని వెల్లడించారు. రాష్ట్రంలో సంపన్న కుటుంబంగా రూ.లక్ష కోట్ల ఆస్తులు సంపాదించారని, ఎన్ని బాత్రూమ్‌లు, చిప్పలు కడిగితే రూ.లక్ష కోట్ల ఆస్తులు వస్తాయని విరుచుకుపడ్డారు.

**రామయ్యకూ శఠగోపం పెట్టిన వ్యక్తి కేసీఆర్**

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారని, కేసీఆర్ బంధువులైన రవీందర్‌రావు, సంతోష్‌రావు మానేరు ఇసుక దొంగలని సీఎం విమర్శించారు. మానేరు ఇసుక కొల్లగొట్టి రవీందర్‌రావు, సంతోష్‌రావు, కేటీఆర్ వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి మానేరు బాధితుల్లో రవీందర్, సంతోష్, సౌమ్య పేర్లు పెట్టారని, ముంపు బాధితుల (మిగతా 2లో)

## ప్రముఖ ఆధ్యాత్మికవేత్త

**⏭ కల్కి భగవాన్ కన్నుమూత**

**టీ మీడియా, సెప్టెంబర్ 30 ,హైదరాబాద్ :**
ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కల్కి భగవాన్ కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన గత పది రోజులుగా చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న (మంగళవారం) మధ్యాహ్నం మూడు గంటలకు తుదిశ్వాస విడిచినట్లు ట్రస్టు ప్రతినిధి తెలిపారు. భగవాన్ కుమారుడైన కృష్ణాజీతో పాటు ఆశ్రమానికి (ఏకం ట్రస్టు) చెందిన దాసాజీలు, ప్రతినిధులు చెన్నైలోని (మిగతా 2లో)



## తెలంగాణ కేబినెట్ సమావేశం

**⏭ ప్రధానాంశం కానున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా**

**టీ మీడియా, సెప్టెంబర్ 30 ,హైదరాబాద్ :**
తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం(అక్టోబర్ 1న) సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏల మంజూరుతో పాటు మరికొన్ని కీలక అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది.

**కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్**

ఉద్యోగులు, పెన్షనర్లకు మొదటి డీఏ 3.64 శాతం, రెండో డీఏ 2.74 శాతం మంజూరు చేసేందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేయనుంది. డిసెంబరు నెలలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణపై కేబినెట్ చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకం విధివిధానాలపై చర్చించే అవకాశం ఉంది. కుటుంబ యజమాని



మరణిస్తే ఐదు లక్షల రూపాయల బీమా ఇచ్చే ఈ పథకాన్ని వచ్చే నెల 19న ఇందిరాగాంధీ జయంతి రోజున ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**ఈ అంశాలపై చర్చ జరిగే అవకాశం**

పాలిటెక్నిక్?లను స్కిల్ ?యూనివర్సిటీలో విలీనానికి సంబంధించి కేశవరావు కమిటీ ఇచ్చిన నివేదికపై మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. నిషేధిత భూముల జాబితా నుంచి (మిగతా 2లో)




## 2 నుంచి ‘సేవ్ డెమోక్రసీ’ యాత్ర




**⏭ ఉద్యమ కార్యాచరణను చేసిన ఇండీ కూటమి**

**టీ మీడియా, సెప్టెంబర్ 30 , ఢిల్లీ బ్యూరో :**
ఓటరు జాబితా సవరణ లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా (మిగతా 2లో)

## దసరా మహోత్సవాలకు రండి



**⏭ సీఎం చంద్రబాబుకు ఆహ్వానం**

**టీ మీడియా, సెప్టెంబర్ 30 ,విజయవాడ:**
ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు ఆహ్వానించారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు రావాలని సీఎంను క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రిక అందించారు. ఈ సందర్భంగా అర్చకులు ముఖ్యమంత్రికి అమ్మవారి ప్రసాదాన్ని అందించి వేదాశీర్వచనం ఇచ్చారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీసిన సీఎం, భక్తులకు సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సీఎంను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించిన వారిలో దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఈఓ శీనా నాయక్, బోర్డు సభ్యులు ఉన్నారు.అలాగే ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానపత్రిక అందింది. దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ పాలకమండలి ఛైర్మన్, ఈవో గవర్నర్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు.

ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆహ్వానం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు దసరా ఉత్సవాలు జరగనున్నాయి. (మిగతా 2లో)

# సిరిసిల్ల గడిని నేలమట్టం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)
ప్యాకేజీ కోసం ప్రభుత్వ సొమ్ము కొల్లగొట్టారని, ముంపులో కొంప పోయిన సంతోష్‌రావు రూ.10 వేల కోట్లు ఎలా సంపాదించారని తెలిపారు. ఒకరు గోదావరి జలాలు, మరొకరు మానేరు ఇసుక కొల్లగొట్టారని, మరొకరు హైదరాబాద్‌లో ఆంధ్రా వాళ్లతో జతకట్టి వ్యాపారాల్లో వాటా తీసుకుంటారని అన్నారు. వేములవాడ శివయ్య, భద్రాద్రి రామయ్యకూ శఠగోపం పెట్టిన వ్యక్తి కేసీఆర్ ఒక్కరేనని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లకు రూ.2,234 కోట్లు ఖర్చు చేశారని, రెండున్నరేళ్లలో సిరిసిల్ల జిల్లాకు రూ.1,731 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం**

బహిరంగ సభాస్థలి వద్దే రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టారు. సిరిసిల్లలో నూతనంగా మంజూరైన నేత బజారు, రూ.5 కోట్లతో పెద్దూరులో నిర్మించనున్న ఇందిరా మహిళా శక్తి భవన్, రూ.15 కోట్లతో రెండు =ఙూ, 4 తహశీల్దార్ కార్యాలయాలకు శంకుస్థాపన, రూ.16 కోట్లతో కొనరావుపేట, సిరిసిల్లలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణం, రూ.99 కోట్లతో వేములవాడ ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 200 కోట్లతో సిరిసిల్లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.10 కోట్లతో రుద్రంగిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

# ప్రముఖ ఆధ్యాత్మికవేత్త

(మొదటి పేజీ తరువాయి)
ఆసుపత్రి వద్ద ఉన్నారు. నేడు (బుధవారం) ఉదయం 11 గంటలకు తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం బత్తులవల్లంలోని ఏకం ఆలయాని (గోల్డెన్ సిటీ)కి కల్కి భగవాన్ పార్థివదేహాన్ని తరలించనున్నట్లు తెలిపారు.

**శనివారం అంత్యక్రియలు**

ప్రజల సందర్శనార్థం పార్థివదేహాన్ని ఇక్కడే ఉంచనున్నారు. ఆలయంలోనే కల్కి భగవాన్ అంత్యక్రియలను శనివారం నిర్వహించేందుకు, సమాధి నిర్మాణానికి పనులు సాగుతున్నాయి. సతీమణి అమ్మ భగవాన్‌తో కలిసి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన కల్కి భగవాన్‌కు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్నారు. ఏకం ఆలయాన్ని రూ.200 కోట్లతో పాలరాతితో నిర్మించారు.
కల్కి భగవాన్ పేరుతో ప్రపంచానికి పరిచయం విజయ్‌కుమార్ పేరుతో ఎల్ఐసీ ఏజెంటుగా, ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన 1992లో తాను కల్కి అవతారమంటూ కల్కి భగవాన్ పేరుతో ప్రపంచానికి పరిచయమయ్యారు. తొలుత కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ఆపై తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు సమీపంలో నేమం ప్రాంతంలో కల్కి భగవాన్‌గా ఆధ్యాత్మిక బోధనలు చేశారు.

**పలు ట్రస్టులు ఏర్పాటు**

ఆపై వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలో కల్కి గ్రామీణాభివృద్ధి ట్రస్టు పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆశ్రమాల్లో విదేశీ భక్తులతో పాటు, దేశం నలుమూలల నుంచి వచ్చే వారికి ధ్యానం, ముక్తి దీక్ష తదితర ఆధ్యాత్మిక తరగతులు నిర్వహించేవారు. కల్కి గ్రామీణాభివృద్ధి, వన్నెస్ హ్యూమన్, లోకా ఫౌండేషన్, ముక్తి తదితరాల పేరిట ట్రస్టులు ఏర్పాటు చేశారు.

# తెలంగాణ కేబినెట్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)
ఊరట కలిగించే అంశాలు, నూతన చేయూత పెన్షన్లు, రాజీవ్ యువ వికాసం, హైదరాబాద్ మెట్రో, మూసీ ప్రాజెక్టు, ఆర్ఆర్ఆర్, ఇందిరమ్మ చీరల పంపిణీపై కూడా చర్చ జరిగే అవకాశముంది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, అంచనాల సవరణపై కేబినెట్ సమాలోచనలు చేయనున్నట్లు తెలుస్తోంది.

**కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం**

తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మరింత జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న 3 మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు కొన్ని మార్పులు చేర్పులు ఉంటాయనే ప్రచారం చాలా కాలంగా జరుగుతోంది. అయితే ఈ ఏడాది చివరి వరకు విస్తరణ ఉండే అవకాశం లేదని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఎన్నిక దాకా కూడా వెళ్లవచ్చని విశ్వసనీయవర్గాల సమాచారం. జరగబోయే కేబినెట్ విస్తరణ, మార్పులు, చేర్పులతో ఎన్నికల టీంగా ఉండాలనే అభిప్రాయంతో కాంగ్రెస్ హైకమాండ్, సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. కేబినెట్?లో మొదటి నుంచి రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో ఖాళీల సంఖ్య మూడుకు పెరిగింది.

# దసరా మహోత్సవాలకు రండి

(మొదటి పేజీ తరువాయి)
ఈ నేపథ్యంలో ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రభుత్వం ఆహ్వానించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మలను ఆహ్వానించేందుకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వెళ్లారు.ఈ క్రమంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను కలిసి ఉత్సవాలకు హాజరవ్వాలని ఆహ్వానపత్రిక అందించారు. అంతకుముందు అస్సాం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి అశోక్ సింఘాల్, ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోత రవితో వేర్వేరుగా భేటీ అయ్యారు. వారికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఇంద్రకీలాద్రి వేడుకల ప్రాధాన్యం వారికి వివరించారు.

# 2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు 'ఓట్ బందీ' ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు.
ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీ–ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేన–యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.మరోవైపు ఈ పరిణామాలను అత్యంత కుంభకోణంతో కూడుకున్న విషయంగా మమతా బెనర్జీ అభివర్ణించారు. జజుజ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన్ను తొలగించకపోతే ఆందోళనలు ప్రతి మూలకూ విస్తరిస్తామని దీదీ హెచ్చరించారు. ప్రధాని మోదీ సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

# సఫాయి మిత్ర సురక్షా శివిర్

● **ముఖ్యఅతిథిగా ఎంపీడీవో ముత్యాలరావు**




**టీ మీడియా, అశ్వాపురం, సెప్టెంబర్ 30:**
అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా "సఫాయి మిత్ర సురక్షా శివిర్" కార్యక్రమాన్ని సర్పంచ్ బానోతు సదర్ లాల్ గారి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సదర్ లాల్ మాట్లాడుతూ, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజల ఆరోగ్యం కోసం వారు ప్రతిరోజూ అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా పారిశుధ్య నిర్వహణలో వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు గ్రామపంచాయతీ తరఫున తగిన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ ముత్యాలరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పారిశుధ్య నిర్వహణలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని అన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణతో పాటు పని సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి, వారికి అవసరమైన సహకారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.అనంతరం పారిశుధ్య కార్మికులకు హెల్త్ చెకప్ నిర్వహించి, శానిటేషన్ కిట్లను అందజేశారు. వారి సేవలను గుర్తించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుల్లూరి ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి యాకూబ్, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ కార్మికులకు వైద్య శిబిరం

**టీ మీడియా ,సెప్టెంబర్ 30, ఆత్మకూరు:**
వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమం మరియు భద్రతలో భాగంగా "సఫాయి మిత్ర సురక్షా ఏవం సమ్మాన్ శిబిర్" కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి జీ. నాగమణి మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రత కోసం ప్రతిరోజూ అంకితభావంతో సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని అన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రత మరియు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ఇటువంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని, విధి నిర్వహణలో తప్పనిసరిగా రక్షణ పరికరాలను వినియోగించాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ ఏ. నరేష్ కుమార్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి ఆరోగ్య పరిరక్షణ కోసం క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వైద్య సలహాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. విధి నిర్వహణ సమయంలో వ్యక్తిగత రక్షణ పరికరాలను తప్పనిసరిగా ఉపయోగించాలని, ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వైద్య సిబ్బంది, శానిటరీ సిబ్బంది మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



# బి టి రోడ్డు కొరకు ధర్నా

**టి మీడియా ,సెప్టెంబర్ 30, ఆత్మకూరు:**
వనపర్తి జిల్లా అమరచింత మండలం మిట్ట నందిమల్ల గ్రామంలో అమరచింత బిజెపి రూరల్ పార్టీ ఆధ్వర్యంలో కిష్టంపల్లి గ్రామం నుండి చింతరెడ్డి పల్లె వరకు బీటి రోడ్డు వేయాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాల నుండి ఈ రోడ్డును పట్టించుకునే నాథుడు కరువయ్యారు గత పాలకులు 10 సంవత్సరాలు పరిపాలన కొనసాగించి వారు రోడ్డు వెయ్యలేదు. గత పాలకులకు ప్రజలు గుణపాఠం చెప్పారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు వేస్తామని నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డును వేయకుండా ప్రజలను మోసం చేయడం జరిగింది రాష్ట్ర మంత్రి తన సొంత నియోజకవర్గంలోనే రోడ్లు ఈ విధంగా గుంతల మయంగా ఉండటం రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటుగా అని చెప్పవచ్చు కాబట్టి వెంటనే మంత్రి స్పందించి తక్షణమే రోడ్డు వేయాలని అమరచింత బిజెపి రూరల్ పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో అమరచింత రూరల్ అధ్యక్షులు సర్పంచ్ మల్లారెడ్డి బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ కురువ హరీష్ బిజెపి కిషన్ మోర్చా అధ్యక్షులు వెంకట్ రాములు బిజెపి నాయకులు భరత సింహారెడ్డి కురుమారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట




● **ఈఎంసీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి**

**టీ మీడియా, సెప్టెంబర్ 30 , ఖమ్మం రూరల్ :**
పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేయడం జరుగుతుందని ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ చేశారు. రూరల్ మండలం ఎం వెంకటయ్య పాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది కార్మికులకు బిపి, షుగర్, పలురకాల రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. తొలుత వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల ఆరోగ్య భద్రతకు పలు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ ఆవిర్భావం అనంతరం పలు దఫాదుగా ఈఎంసి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామన్నారు.'తెల్లవారుజాము నుండి అనేక పారిశుధ్య పనులలో నిమగ్నమవుతున్న కార్మికులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రోజువారి పనులలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారికి అవసరమైన పరికరాలను, ఇతర సామగ్రిని అందుబాటులో ఉంచామన్నారు. కార్మికులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే వార్డులు పచ్చదనం పరిశుభ్రంతో ఉంటాయని గుర్తు చేశారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకునేందుకుగాను కార్యాచరణ ఏర్పాటు చేయడంతో పాటు, విడతలవారీగా వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత హి సేవా ఆరోగ్య శిబిరం ఏర్పాటు

**టీ మీడియా, సెప్టెంబర్ 30 ,పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి)లో డాక్టర్ నదియా సదత్ ఎం పి వో రోజా రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా 2026 సఫాయి మిత్రుల ఆరోగ్య పరీక్షలు అవగాహన శిబిరం నిర్వహించారు
సాధారణ ఆరోగ్య పరీక్షలు,బి పి రక్తంలో చక్కెర స్థాయిలు పరీక్ష,అవసరమైన వారికి రక్తహీనత (అనీమియా) పరీక్ష ఆరోగ్యం పరిశుభ్రతపై అవగాహన, అంటువ్యాధుల నివారణ,వృత్తిపరమైన ఆరోగ్యం భద్రతపై అవగాహన,కౌన్సెలింగ్ రిఫరల్ సేవలు పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య అవగాహనస్వచ్ఛత హి సేవా 2026లో భాగంగా సఫాయి మిత్రుల కోసం నివారణాత్మక ఆరోగ్యం పరిశుభ్రత వృత్తిపరమైన భద్రత సమగ్ర ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ ఈ ఆరోగ్య పరీక్షలు అవగాహన శిబిరం



నిర్వహించబడింది
ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్ర శేఖర్ అర్ బి ఎస్ కె డాక్టర్ సునీల్ కుమార్ ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్ ఎం పి హెచ్ ఎస్ స్వరూపరాణి హెల్త్ అసిస్టెంట్ లు రాజశేఖర్ తిరుపతయ్య డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్ ఆశా కార్యకర్త లు పాల్గొన్నారు.

# సిఎం వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి ధర్నా



**టీ మీడియా,సెప్టెంబర్ 30 ,పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని స్తానిక సుభాష్ చౌక్ లో ధర్నా చేపట్టిన భారతీయ జనతా పార్టీ పెబ్బేరు పట్టణ మండల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఈ దేశాన్ని విభజించి పాలించాలి అన్న బ్రిటీషర్స్ యొక్క తెలివి తేటలతో ఆలోచనలతో పుట్టిన పార్టీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈదేశాన్ని ఉత్తర దక్షిణ భాగాలుగా విడదీయాలన్న ఉద్దేశంతో ఇరు ప్రాంతాల ప్రజల్లో దేవుల్ల పేరు మీద కులాలు విడదీస్తూ పలు సందర్భాలలో దైవ దూషణకు పాల్పడిన ముఖ్యమంత్రి ఈ సందర్భంగా బా జ పా శ్రేణులు బుదవారశీ మున్సిపల్ కేంద్రంలో ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశారు ఈ కార్యక్రమంలో బా జ పా పట్టణ మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ శిక్షణ శిబిరం ముగింపు

**టీ మీడియా ,సెప్టెంబర్ 30, మధిర:**
స్థానిక మధిర మినీ స్టేడియంలో డస్టిక్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ టి సునీల్ రెడ్డి , స్టేడియం ఇన్‌చార్జ్ కం అడ్మినిస్ట్రేటర్ వై. చిన్ని అధ్యక్షతన గత ఆరు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్న కబడ్డీ క్రీడాకారులకు ఈ శిక్షణ శిబిరంలో ప్రత్యేక శిక్షణ అందించారు.ముగింపు కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె. క్రిస్టఫర్ బాబు , సుధాకర్ , మాజీ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు మిర్యాల రమణ గుప్తా, 2వ వార్డు కౌన్సిలర్ భూక్య రమణ నాయక్ లి పాల్గొని క్రీడాకారులకు విలువైన సూచనలు అందించి రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మిర్యాల రమణ గుప్తా, భూక్య రమణ నాయక్ మాట్లాడుతూ,



క్రీడాకారులు క్రమశిక్షణతో కృషి చేసి రాష్ట్రస్థాయిలో ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆరు రోజుల శిక్షణ శిబిరానికి సహకరించిన మిర్యాల రమణ గుప్తా, భూక్య రమణ నాయక్‌లను జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె. క్రిస్టఫర్ బాబు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన కబడ్డీ కోచ్‌లు కనకపుడి ప్రవీణ్, శ్రీనివాసులునుఈ క్యాంపుకు సహకరించిన బ్యాడ్మింటన్ కోచ్ సునీల్ ను కె. క్రిస్టఫర్ అభినందించారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించి రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేసిన కోచ్‌ల సేవలను ప్రశంసించారు.

# జూనియర్ కబడ్డీ జట్టుకు అమరచింత క్రీడాకారుడు

**టీ మీడియా ,సెప్టెంబర్ 30,అమరచింత:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో నిర్వహించిన జూనియర్ కబడ్డీ జట్టు ఎంపికల్లో అమరచింత పట్టణానికి చెందిన అంబడికొండ కుమార్, సన్నాఫ్ అంబడికొండ వెంకటేష్ అద్భుత ప్రతిభ కనబరిచి వనపర్తి జిల్లా జూనియర్ కబడ్డీ జట్టులో చోటు సంపాదించాడు.ఎంపికల సందర్భంగా కుమార్ తన ఆటతీరుతో, చురుకుదనంతో పాటు కబడ్డీలో మెరుగైన నైపుణ్యాలను ప్రదర్శించి సెలెక్టర్ల దృష్టిని ఆకట్టుకున్నాడు. కఠినమైన పోటీలో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావడం అమరచింత పట్టణానికి గర్వకారణంగా నిలిచాడు.,వనపర్తి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 02 నుంచి 05వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీల్లో అంబడికొండ కుమార్ వనపర్తి జిల్లా తరఫున తన ప్రతిభను చాటుకోనున్నాడు.ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి కురుమయ్య, పిడి రవి కిరణ్ గౌడ్, కబడ్డీ కోచ్ జిలాని తదితరులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన శిక్షణ, ప్రోత్సాహం లభిస్తే వారు జిల్లా, రాష్ట్ర,



జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంబడికొండ కుమార్ రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అమరచింత, వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అమరచింత నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక కావడం పట్ల స్థానిక ప్రజలు, యువ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షించారు.

# లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలు పాటించాలి...

**⏭ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**టీ మీడియా ,సెప్టెంబర్ 30, ఖమ్మం:**
లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, పెండింగ్‌లో ఉన్న లేఔట్ అనుమతులపై సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్, తదితర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలు, ఎన్ఓసీల స్థితిగతులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూలి లేఔట్ కమిటీ సమావేశం అనంతరం అనుమతులు మంజూరైనప్పటికీ కొంతమంది దరఖాస్తుదారులు ఆన్లైన్‌లో అనుమతులు మంజూరు కాలేదని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఇకపై లేఔట్ కమిటీ ఆమోదం పొందిన వెంటనే సంబంధిత ఆన్లైన్ మంజూరు ప్రక్రియను మూడు రోజుల్లోగా పూర్తి చేసేలాలి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.లేఔట్ అనుమతులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పరిశీలన, సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిపాదిత లేఔట్ భూమి చెరువులు, నీటి వనరులు, ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో ఉందా లేదా క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర సంబంధిత శాఖలు తమ పరిధిలోని అంశాలను పరిశీలించి అవసరమైన ఎన్ఓసీలు, నివేదికలను సకాలంలో అందించాలని ఆదేశించారు.లేఔట్ కు అప్రోచ్ రోడ్డు, అంతర్గత రోడ్లు ఉండాలని అన్నారు.



రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లేఔట్‌లో కేటాయింపులు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.లేఔట్‌లో స్ట్రీట్ లైట్స్, సీవరేజ్ వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా తప్పనిసరిగా ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు జారీ చేయరాదని స్పష్టం చేశారు.లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి వనరులు, నీటి ప్రవాహ మార్గాలు ఉన్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని తెలిపారు.అనుమతులు మంజూరు చేసిన అనంతరం కూడా వాటిలో పేర్కొన్న నిబంధనలను లేఔట్ అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నివేదికలకు స్పష్టమైన కాలపరిమితి విధించి, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే సంయుక్త పరిశీలన అవసరమైన లేఔట్లకు సంబంధించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టులను అక్టోబర్ 15వ తేదీలోగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు శ్రీనిధి విద్యార్థి ఎంపిక

**టీ మీడియా ,సెప్టెంబర్ 30, మధిర:**
శ్రీనిధి జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్కే షరీఫ్ రాష్ట్రస్థాయి అండర్–19 వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 8, 9, 10 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్–19 వాలీబాల్ పోటీల్లో షరీఫ్ పాల్గొననున్నాడు.కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న షరీఫ్ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకొని, తన ప్రతిభతో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక కావడం పట్ల కళాశాల చైర్మన్ వై. అనిల్ కుమార్ నెహ్రూ, ప్రిన్సిపాల్ తాళ్లూరి రమేష్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు షరీఫ్‌ను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో



క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు కళాశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

# వైద్యుడి కుటుంబానికి అండగా గ్రామీణ వైద్యులు

**⏭ పుల్లారావు కుటుంబానికి ఆర్థిక సాయం**

**టీ మీడియా,సెప్టెంబర్30,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాదారం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు పుల్లారావు మృతి చెందగా,ఆయన కుటుంబానికి గ్రామీణ వైద్యుల సహాయక సంఘం అండగా నిలిచింది.పుల్లారావు సంస్మరణ కార్యక్రమాన్ని బుధవారం పెద్దమండవలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామీణ వైద్యుల సహాయక సంఘం సింగరేణి మండల అధ్యక్షుడు గండమల వెంకటేశ్వర్లు,కార్యదర్శి సిలువేరు రమేష్ హాజరై పుల్లారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు



ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల సహాయక సంఘం ఆధ్వర్యంలో పుల్లారావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.కష్టకాలంలో తోటి గ్రామీణ వైద్యుడి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో సంఘం తరఫున సహాయం అందించినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాదారం మాజీ సర్పంచ్ అజ్మీరా నరేష్,గ్రామీణ వైద్యులు వి.వెంకటేశ్వర్లు, సతీష్, వేణు, లక్ష్మీనారాయణ,బాబురావు,రఫీ, ఉపేందర్, లక్ష్మణ్, రాజేష్,నరేష్,మోహన్‌రావు, మంగ్య, డి.రాజు, బి.రాజు, నాగచారి,సుమంత్, గిరిబాబు,బాబూలాల్,సర్దార్,నాగేందర్,కృష్ణ,కే.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అనాథలుగా తల్లిదండ్రులు



**⏭ చివరికి విషాదాంతం!**

**టీ మీడియా, సెప్టెంబర్ 30 , సంగారెడ్డి :**
జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. నారాయణఖేడ్ మండలం చాప్ట(కె) గ్రామంలో వృద్ధ దంపతులు బావిలో దూకి మృతి చెందారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద ఉన్న బావిలో నర్సిరెడ్డి (75), ఆయన భార్య అంజమ్మ (70) మృతదేహాలు లభ్యమయ్యాయి.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా వృద్ధ దంపతులు తమ ముగ్గురు కుమారులు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఇదే విషయంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కుమారులు తమతో మాట్లాడటం లేదనే మనస్తాపంతో వారు తీవ్రంగా కలత చెందినట్లు స్థానికులు చెబుతున్నారు.ఈ క్రమంలోనే బుధవారం (సెప్టెంబర్ 30) వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన దంపతులు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే బావిలో గాలించి మృతదేహాలను బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.వృద్ధ దంపతుల మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వారి మరణానికి దారితీసిన పరిస్థితులు, కుటుంబ సంబంధిత అంశాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కన్న పిల్లల ఆదరణ లేక మనస్తాపంతో వృద్ధ దంపతులు ప్రాణాలు తీసుకున్నారనే సమాచారం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన స్థానికులను కలచివేసింది.

# దుర్గంధ భరితమైన బై పాస్ రోడ్డు



**టీ మీడియా, సెప్టెంబర్ 30 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ పరిధిలోని కర్నూలుకు వెళ్ళే బై పాస్ దగ్గర మురికి కూపాలుగా రోడ్డు పక్కనే చనిపోయిన కుక్కలు గొర్రెల తో దుర్గంధ భరితమైన వాసనతో వాహన చోదకులు తలలు పట్టుకుంటున్నారు రోడ్డుకు అనుకుని బూడిద చెత్త చెదరంలతో ముళ్ళ కంపలతో డంపింగ్ యార్డులా మారిన బైపాస్ రహదారి పట్టణ ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించాలని పట్టణ వాసులు వాహన చోదకులు కోరుతున్నారు.

# పౌష్టికాహారం తీసుకోవాలి



**టీ మీడియా, సెప్టెంబర్ 30, కూసుమంచి:** గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలు తప్పనిసరిగా మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండా కృష్ణవేణి మహిపాల్ అన్నారు. మండల కేంద్రం కూసుమంచి గ్రామపంచాయతీ హాల్లో బుధవారం పోషణ మాసం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక అంగన్వాడి కేంద్రంలోగర్భిణీలకు సీమంతం, అన్న ప్రాసన కార్యక్రమాలు జరిపి, తీసుకోవలసిన పౌష్టికాహారం గురించి వివరించారు. పోషణ ప్రదర్శన జరిపారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలు, తల్లులకు పోషకాహారము గురించి,ఆటలు నిర్వహించి, బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండా కృష్ణవేణి, గ్రామ సెక్రెటరీ నీరజ , స్కూలు హెచ్ఎం హేమ్లా, ఉపాధ్యాయులు శ్రీరాములు , విజయలక్ష్మి, శృతి, అపర్ణ , అంగన్వాడి సూపర్వైజర్ సువర్చల, ఏ ఎన్ ఎం సరళా దేవి, ఆశా కార్యకర్త మరియమ్మ, అంగన్వాడీ టీచర్లు పుష్పలత, లక్ష్మీకాంత, వరలక్ష్మి, పద్మ, అంగన్వాడీ 23 కేంద్రాల టీచర్లు , గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా గోళ్ల మురళి



**టీ మీడియా, సెప్టెంబర్ 30,హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ముఖ్య సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం పట్టణ రేషన్ డీలర్, మాజీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ఖమ్మం పట్టణ కోశాధికారి గోళ్ల మురళిని రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాయకోటి రాజు గోళ్ల మురళి నియామకాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో, జిల్లాలో రేషన్ డీలర్ల సమస్యలపై విస్తృత సంబంధాలు కలిగి ఉండటంతో పాటు, రేషన్ డీలర్ల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆయనను రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

గోళ్ల మురళి ఎన్నికపై ఖమ్మం జిల్లా రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మురళి పేర్కొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**టీ మీడియా, సెప్టెంబర్ 30, నెలకొండపల్లి :** పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 జూన్ 9 న నమోదైన హత్య కేసులో నిందితుడికి గౌరవ న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించింది.కేసు వివరాలు:భూ తగాదాల విషయమై జరిగిన పాత కక్ష్యలను మనసులో పెట్టుకొని కొట్టి చంపిన ఘటనలో నెలకొండపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 108/2022, సెక్షన్ 302 భ్రూజ కింద నమోదైన కేసులో రాజ చీశీ.88/2024 పై విచారణ పూర్తిచేసిన స్పెషల్ ఉమెన్ కోర్టు, ఐదోవ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు, ఖమ్మం గౌరవ న్యాయమూర్తి వాసుకుల శ్రీనయ్య నిందితుడైన నెలకొండపల్లి మండలం.చెరువుమాదారం గ్రామానికి చెందిన రెడ్డిబోయిన నాగ రాములు ఏ నాగరాజు, 45 సం,, ను దోషిగా నిర్ధారించి, జీవిత ఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధించారు.జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల అదనపు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు చెప్పారు. ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారిగా ఎస్.ఐ. జి. శ్రావంతి, రెండో దర్యాప్తు అధికారిగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. సతీష్ విధులు నిర్వహించారు. ప్రభుత్వ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. ఉపేందర్ వాదనలు వినిపించారు.కేసు దర్యాప్తు, కోర్టు లైజన్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించిన కోర్టు కానిస్టేబుల్ ఆఫీర్ యం. రామారావు, జీ. రాము,ఎస్పై కె. శ్రీకాంత్, హోంగార్డ్ ఆఫీసర్ ఎస్. సీతయ్య ను పోలీస్ కమిషనర్ అభినందించారు.

## పోక్సో కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష

**టీ మీడియా, సెప్టెంబర్ 30, ఖమ్మం లీగల్ :** ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించింది.కేసు వివరాలు:ప్రేమ పేరుతో మైనర్ యువతిని వేధించిన ఖమ్మం నగరానికి చెందిన చెకూరి శ్రీకాంత్(20 ) పోక్సో చట్టం కింద నమోదైన కేసును విచారించిన మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు, ఖమ్మం గౌరవ న్యాయమూర్తి డా. పుల్లభట్ల పొగడ కృష్ణ అర్జున్ నిందితుడిని దోషిగా నిర్ధారించి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు.కేసు దర్యాప్తును ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. శ్రీకాంత్ నిర్వహించారు. ప్రభుత్వ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదనలు వినిపించారు. కోర్టు లైజన్ ఆఫీసర్ కె. శ్రీకాంత్, ఎస్ఐ నిర్వహించగా, హోంగార్డ్ ఆఫీసర్ ఎం. అయూబ్ (హోంగార్డ్) సహకరించారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- ఎరువుల దుకాణాల్లో ఏడీఏ కరుణశ్రీ ఆకస్మిక తనిఖీలు



**టీ మీడియా,సెప్టెంబర్30,సింగరేణి(కారేపల్లి):** రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని,నమోదు చేసుకోని రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ వ్యవసాయ పథకాలకు అర్హులు కారని వ్యవసాయ శాఖ వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ తెలిపారు.ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా దుకాణాల్లో ఎరువుల నిల్వలు,స్టాక్ రిజిస్టర్లు,విక్రయ వివరాలను పరిశీలించారు.ఎరువుల గోదాములను తనిఖీ చేసి రికార్డుల్లో చూపుతున్న నిల్వలకు,గోదాముల్లో ఉన్న నిల్వలకు సరిపోలుతున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు.అలాగే పురుగుమందుల గడువు తేదీలు,వాటి నిల్వ,విక్రయాలకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏడీఏ కరుణశ్రీ మాట్లాడుతూ రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఎంతో కీలకమని పేర్కొన్నారు.ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రవేశపెట్టే వివిధ పథకాలు,ప్రయోజనాలను పొందేందుకు అర్హత విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.అందువల్ల రైతులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.మండలంలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని నిబంధనల ప్రకారం యూరియాను పొందాలని సూచించారు.ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,అవసరాలకు అనుగుణంగా సరఫరా జరిగేలా వ్యవసాయ శాఖ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు.ఎరువుల వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని స్పష్టం చేశారు.నిర్ణీత ధర కంటే ఒక్క రూపాయి అధికంగా వసూలు చేసినా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులపై విచారణ జరిపి,నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత దుకాణదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎరువులు,పురుగుమందుల విక్రయాల్లో దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని,స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.రైతులకు నాణ్యమైన ఎరువులు,పురుగుమందులు అందేలా తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ తనిఖీల్లో సింగరేణి మండల వ్యవసాయ అధికారి బట్టు అశోక్‌కుమార్,ఏఈఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జ్వరమే ప్రాణాలు తీసింది..

### డెంగీతో 15 ఏళ్ల బాలుడి మృతి!



**టీ మీడియా, సెప్టెంబర్ 30 , నాగర్‌కర్నూల్** తెలంగాణలో డెంగీ కేసుల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. డెంగీతో 15 ఏళ్ల బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం (సెప్టెంబర్ 29) వెలుగులోకి వచ్చింది. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఈశ్వర్‌కాలనీకి చెందిన ప్రభాకర్, నాగరాణి దంపతుల ఏకైక కుమారుడు యశ్వంత్ (15) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

నాలుగు రోజుల క్రితం యశ్వంత్‌కు జ్వరం రావడంతో హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కుటుంబ సభ్యులు అతడిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి యశ్వంత్ మృతి చెందాడు. డెంగీ కారణంగానే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. యశ్వంత్ తండ్రి ప్రభాకర్ జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి నాగరాణి నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఎంతో ఆశగా పెంచుకున్న ఏకైక కుమారుడు అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. బాలుడి మృతితో స్థానికంగా కూడా విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇటీవల తెలంగాణలో జ్వరాలు, డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో యశ్వంత్ మృతి స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, దోమల నియంత్రణ చర్యలపై ప్రజలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# గంజాయి రవాణా కేసులో పది సంవత్సరాలు జైలు శిక్ష

**టీ మీడియా, సెప్టెంబర్ 30 , ఖమ్మం లీగల్:** మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ జిల్లా కచువా మండలం కుడ్ ఫర్ కు చెందిన 1)రాజేష్ కిరార్ 2)రాజ్ కుమార్ రాజ్ పుత్,3) హరి ఓం మరియు ఉత్తర ప్రదేశ్ దాద్రి కి చెందిన 4)పూనందేవిలకు గంజాయి అక్రమశీగా రవాణా చేసిన కేసులో 10 సంవత్సరాల జైలు శిక్ష, తలా ఒక లక్ష జరిమానా చొప్పున విధిస్తూ స్థానిక ఇన్చార్జ్ అదనపు జిల్లా కోర్టు న్యాయ మూర్తి పి.పి.కృష్ణార్జున బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు ఖమ్మం రైల్వే పోలీసులు ది 6/ 9/ 2022 న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా ఖమ్మం రైల్వే ప్లాట్ఫారం నెంబర్ 2 దగ్గర పై నిందితులు అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వారి వద్ద ఆరు బ్యాగులు లభించగా తనిఖీ చేయడంతో అందులో 38 గంజాయి ప్యాకెట్లు లభించాయి. మొత్తం 101 కేజీలుగా తేలింది. గంజాయిని తక్కువ రేటుకు కొని డబ్బులు సంపాదించాలనే అత్యాశతో ఎక్కువ రేటుకు అమ్మాలని ఇలా అక్రమ రవాణాకు పాల్పడ్డామని తెలుపగా పంచుల సమక్షంలో వారి వివరాలు తెలుసుకొని గంజాయిని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి, అదే రోజు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి, అనంతరం దర్యాప్తు నిర్వహించి ప్రత్యేక కోర్టు నందు చార్జ్ షీట్ దాఖలు చేయగా ,అట్టి కేసు విచారణకు రాగా సాక్షులను విచారించి, ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులు గంజాయిని అక్రమంగా రవాణా చేశారని నిర్ధారించి వారిని పై విధంగా శిక్షిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదించగా లైజై న్ అదికారి శ్రీకాంత్, సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కోర్ట్ కానిస్టేబుల్ రహీం భాష, గాంధీ కోర్టు హోంగార్డు ఆయుబ్ లు సహకరించారు.

# రూ.17 లక్షల కు కిరాణా వ్యాపారి ఐపీ

**టీ మీడియా, సెప్టెంబర్ 30, ఖమ్మం లీగల్ :** ఖమ్మంకి చెందిన కిరాణా వ్యాపారి వందనం కాశి విశ్వనాథమ్మానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.17,00,000 /- కు ఐపీ దాఖలు చేశారు. మొత్తం 15మంది రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. కేసు వివరాల ప్రకారం.. పిటిషనర్ విశ్వనాథమ్ ఖమ్మం పట్టణంలో కిరణా వ్యాపారం చేసివాడు. ఈ వ్యాపారాన్ని అబివృద్ధి చేయడం కోసం అధిక వడ్డీ లకు బంధువుల దగ్గర స్నేహితులు దగ్గర అధిక మొత్తంలో అప్పులు తీసుకున్నాడు. ఈ వ్యాపారం లో తీవ్ర నష్టాలు రావడంతో బాకీలు తీర్చలేని పరిస్థితి ఏర్పడిందని, తనను దివాలాదారుని గా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది కొలకలూరి ప్రసాద్ ద్వారా కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

# పైలట్ల మధ్య గొడవ

- విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్
- 7 నిమిషాల వ్యవధిలో రెండు కీలక హెచ్చరికలు

**టీ మీడియా, సెప్టెంబర్ 30 , ఢిల్లీ బ్యూరో :** దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళ్తున్న ఫ్లై దుబాయ్ కమర్షియల్ విమానంలో ఊహించని పరిణామం జరిగింది. గాల్లో ఉండగా రష్యా, ఉక్రెయిన్ పైలట్ల మధ్య జరిగిన భయంకరమైన ఘర్షణ ఏకంగా హైజాక్ కలకలానికి దారితీసింది. ఓ పైలట్ సహ పైలట్‌పై కత్తితో దాడి చేసి విమానాన్ని కుప్పకూల్చేందుకు యత్నించాడు. ఘటన సమయంలో విమానంలోనే ప్రయాణిస్తున్న ఇద్దరు పైలట్లు సకాలంలో స్పందించి విమానాన్ని నియంత్రణలోని తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ మేరకు ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది.

అసలేం జరిగింది?

బుధవారం ఉదయం (స్థానిక కాలమానం ప్రకారం) దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సుమారు 180 మంది ఇజ్రాయెల్ ప్రయాణికులతో ఫ్లై దుబాయ్ విమానం ఫ్లీ1073 టెల్ అవీవ్‌కు బయలుదేరింది. గాల్లో ఉండగా హఠాత్తుగా విమానం కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే 34,000 అడుగుల ఎత్తు నుంచి 16,600 అడుగులకు అమాంతం పడిపోయింది. కేవలం ఏడు నిమిషాల వ్యవధిలో ఏవియేషన్ వర్గాలకు రెండు కీలక ప్రమాద హెచ్చరికలు వచ్చాయి. తొలుత సాధారణ ఎమర్జెన్సీ కోడ్ 7700 అందింది. ఆ వెంటనే హైజాక్‌ను సూచించే 7500 కోడ్ ట్రాన్స్‌మిట్ కావడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది.

విమానంలో ఎలాంటి హైజాక్ జరగలేదు!

వాస్తవానికి విమానంలో ఎలాంటి హైజాక్ జరగలేదు. కాక్‌పిట్ ఆధారంగా విమానంలో రష్యా, ఉక్రెయిన్ దేశాలకు చెందిన ఇద్దరు పైలట్లు ఉన్నట్టు తెలుస్తోంది. పైలట్ల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణే ఈ ఉద్రిక్తతకు దారితీసినట్లు ఇజ్రాయెల్ భద్రతా అధికారులు వెల్లడించారు. ఓ పైలట్ ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో విమానాన్ని కుప్పకూల్చేందుకు యత్నించాడు. అడ్డుకున్న మరో పైలట్‌పై మడత కత్తితో దాడి చేశాడు. కాక్‌పిట్ నుంచి అరుపులు వినిపించడంతో ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. కాక్‌పిట్ తలుపు తెరిచి చూడగా అంతా రక్తమయంగా కనిపించిందని, ఒక దశలో తాము ప్రాణాలతో బయటపడతామని అనుకోలేదని మిరియమ్ అనే ప్రయాణికురాలు తెలిపారు.

సురక్షితంగా ల్యాండ్ అయిన విమానం

వెంటనే కొందరు ఇజ్రాయెల్ ప్రయాణికులు, సిబ్బంది సాయంతో దాడికి పాల్పడుతున్న పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# ఖమ్మం కేంద్రంగా నకిలీ బ్రాండెడ్ వస్తువుల దందా








టీ పొడి

● ఎలక్ట్రానిక్, టీ పొడి, ఫ్యాన్సీ, కాస్మెటిక్స్ తదితర వస్తువుల విక్రయాలపై ఆరోపణలు

● వెల్ఫేర్ సొసైటీ పేరుతో వసూళ్ల వ్యవహారంపై చర్చ

**టీ పొడి.**ఖమ్మం నగరం కేంద్రంగా అసలైన బ్రాండ్లను పోలిన నకిలీ వస్తువుల విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలు వెలువడుతున్నాయి. నగరంలోని అజీజ్‌గల్లి కేంద్రంగా ఈ వ్యాపారం విస్తరించి, జిల్లాలోని పలు ప్రాంతాలకు నకిలీ బ్రాండెడ్ వస్తువులు సరఫరా అవుతున్నట్లు సమాచారం.

ఎలక్ట్రికల్ వస్తువులు, టీ పొడి, ఫ్యాన్సీ వస్తువులు, కొబ్బరి నూనె, సబ్బులు, కాస్మెటిక్స్ తదితర ఉత్పత్తులను ప్రముఖ కంపెనీల బ్రాండ్లను పోలిన ప్యాకింగ్‌తో విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయల విలువైన లావాదేవీలు జరుగుతున్నాయనే సమాచారం ఉన్నప్పటికీ, సంబంధిత శాఖల తనిఖీలు, చర్యలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

'వెల్ఫేర్ సొసైటీ' పేరుతో వసూళ్ల ఆరోపణలు

నకిలీ బ్రాండెడ్ వస్తువుల వ్యాపారంతో సంబంధం ఉన్న కొంతమంది వ్యక్తులు ఒక 'వెల్ఫేర్ సొసైటీ' పేరుతో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు, రాజకీయ నాయకులు, విలేకరుల పేర్లతో అక్రమ వ్యాపారుల నుంచి ప్రత్యేకంగా వసూళ్లు చేస్తున్నారనే సమాచారం కూడా చర్చనీయాంశంగా మారింది.

అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సొసైటీకి చెందిన వ్యక్తుల వివరణ, అధికారిక రికార్డులు, ఆర్థిక లావాదేవీల వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. నిజానిజాలను సంబంధిత అధికారులు దర్యాప్తు చేసి స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

చట్టబద్ధంగా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపార సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి సంస్థలకు భిన్నంగా అక్రమ వ్యాపారాలకు సంబంధించిన వ్యక్తులు ప్రత్యేకంగా సొసైటీ ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

**టాస్క్‌ఫోర్స్ దాడితో వెలుగులోకి నకిలీ వైర్ల వ్యవహారం**

ఇటీవల ఆగస్టులో విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, ఖానాపురం హవేలీ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించిన ఘటన నకిలీ ఎలక్ట్రికల్ వస్తువుల వ్యవహారంపై మరిన్ని ప్రశ్నలను లేవనెత్తింది.

ఖమ్మం నగరంలోని 6వ డివిజన్ పరిధి ప్రశాంతినగర్‌లో నకిలీ వైర్లను తయారు చేసి, ప్రముఖ బ్రాండ్ల పేర్లతో ప్యాకింగ్ చేస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు సమాచారం. ఈ సమయంలో వ్యాపారంతో పాటు కొంతమంది వర్కర్లు పరారైనట్లు, ఇద్దరు రాజస్థాన్‌కు చెందిన కార్మికులతో పాటు రఘునాథపాలెం మండలం కొర్లబోడుతండాకు చెందిన అనిల్ అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అప్పట్లో వెల్లడైంది. దాడిలో నకిలీ వైర్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

**ఏళ్లుగా సాగుతున్న దందా?**

శానిటరీ సామగ్రి గోదాం పేరుతో ఒక ప్రదేశాన్ని అద్దెకు తీసుకుని, అక్కడ నకిలీ వైర్లను ప్రముఖ బ్రాండ్ల ప్యాకింగ్‌ను పోలిన విధంగా ప్యాక్ చేసి మార్కెట్‌లోకి పంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎలక్ట్రీషియన్ల ద్వారా ఇళ్ల యజమానులకు ఈ వస్తువులను విక్రయిస్తున్నారనే సమాచారం కూడా ఉంది. నకిలీ విద్యుత్ పరికరాల నాణ్యతపై నియంత్రణ లేకపోతే షార్ట్‌సర్క్యూట్లు, అగ్ని ప్రమాదాలు వంటి ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉన్నందున ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**అనుమతి లేని గోదాములపై ప్రశ్నలు**

ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో అనుమతులు, భద్రతా ప్రమాణాలు స్పష్టంగా లేని గోదాముల్లో భారీగా సరుకు నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మామిళ్లగూడెంలో టీ పొడి గోదాం, పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని రోడ్డులో శానిటరీ మెటీరియల్ గోదాం, ముస్తఫానగర్, శ్రీనివాసనగర్, ప్రభాత్ టాకీస్ ప్రాంతాలతో పాటు హవేలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మరికొన్ని ప్రాంతాల్లో అనుమతి లేని గోదాములు ఉన్నాయనే సమాచారం అందుతోంది.

గొల్లగూడెం రోడ్డులో బోర్డు లేకుండా నిర్వహిస్తున్నట్లు చెబుతున్న ఒక గోదాములో భారీగా ఫ్యూజులు, ఎలక్ట్రికల్ సామగ్రి నిల్వ ఉన్నట్లు సమాచారం. ఈ గోదాముల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు ఉన్నాయా? అగ్నిమాపక శాఖ అనుమతులు ఉన్నాయా? విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కామన్‌బజార్ పరిధిలోనే పది వరకు గోదాములు ఉన్నాయనే సమాచారం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది.

**అధికారుల తనిఖీలు ఎక్కడ?**

నకిలీ బ్రాండెడ్ వస్తువుల విక్రయాలు, అనుమతి లేని గోదాములు, బ్రాండ్ల పేర్ల దుర్వినియోగం, భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై సంబంధిత శాఖలు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

ముఖ్యంగా పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, డ్రగ్ కంట్రోల్‌కు సంబంధించిన అంశాలు ఉన్న చోట సంబంధిత శాఖలు, అగ్నిమాపక శాఖ, వాణిజ్య పన్నుల శాఖ తమ పరిధిలో రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సి ఉంది.

అక్రమ వ్యాపారం జరుగుతోందని ఆరోపణలు వస్తున్న ప్రాంతాల్లో అధికారుల తనిఖీలు, సీజ్‌లు, కేసుల వివరాలను బహిరంగపరచాలని ప్రజలు కోరుతున్నారు.

మరిన్ని వివరాలు మరో ఎపిసోడ్‌లో...

నకిలీ బ్రాండ్ల వెనుక అసలు సరఫరా వ్యవస్థ ఎవరిది?

గోదాములకు అనుమతులు ఉన్నాయా?

వెల్ఫేర్ సొసైటీ వ్యవహారంలో అసలు పాత్రధారులు ఎవరు?

అధికారుల తనిఖీల రికార్డులు ఏమి చెబుతున్నాయి?

(ఈ అంశంపై మరిన్ని ఆధారాలు, పత్రాలు, అధికారిక రికార్డులతో తదుపరి కథనం.. లో.)

# దొంగతనం చేయలేరని సవాలు విసిరింది అందుకే చేశాం



● యూట్యూబర్ ఇంట్లో చోరీపై దొంగల షాకింగ్ స్టేట్‌మెంట్

**టీ మీడియా, సెప్టెంబర్ 30 , చెన్నై :**

తమిళనాడులోని ప్రముఖ యూట్యూబర్ మధుమిత ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితులు కీలక విషయాలను వెల్లడించారు. మధుమిత సోషల్ మీడియాలో చేసిన పోస్టులను చూసిన తర్వాతే చోరీకి పాల్పడినట్లు నిందితులు పోలీసుల విచారణలో అంగీకరించారు. అంతేకాకుండా తన ఇంట్లో దొంగతనం చేయడం సాధ్యం కాదని మధుమిత చేసిన వ్యాఖ్యలను నిందితులు సవాలుగా తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో తూత్తుకుడికి చెందిన ఇసాక్కి పాండియన్, అతడి సహచరులు సహా నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపంలోని ధమ్మతుకోన్ వీబీపీ గార్డెన్ ప్రాంతంలో వినోద్ కుమార్ పలు వ్యాపారాలు చేస్తూ కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఆయన భార్య మధుమిత ప్రముఖ యూట్యూబర్. ఆమె సోషల్ మీడియా వేదికలపై తరచూ వీడియోలు పోస్టు చేస్తుంటారు. ఈ క్రమంలో మధుమిత ఇటీవల సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్టు చేశారు. అందులో తన ఇంట్లో లక్షల రూపాయల నగదు ఉందని, నెలకు ఒకసారి బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తానని పేర్కొన్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

పోస్టులు చూసి చోరీకి ప్లాన్

మధుమిత పోస్టు చేసిన వీడియోలను చూసిన కొందరు దుండగులు ఆమె ఇంటిని లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లోకి చొరబడి నగదు, బంగారు ఆభరణాలను దొంగిలించి పరారయ్యారు. మధుమిత ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఇంట్లో 118 సవర్ల బంగారు, వజ్రాల ఆభరణాలతో పాటు రూ.50 వేల నగదు చోరీకి గురైంది. చోరీపై మధుమిత రాజక్కమంగళం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీను పరిశీలించారు. ఈ క్రమంలో నలుగురు సభ్యుల ముఠా ఇంట్లోకి ప్రవేశించి చోరీ చేసినట్లు గుర్తించారు.

160 సీసీటీవీ కెమెరాల పరిశీలన

ఈ కేసు దర్యాప్తులో భాగంగా రాజక్కమంగళం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలు ఘటనాస్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాయి.

కన్యాకుమారి సబ్-డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం, ఘటనాస్థలం నుంచి శ్రీవైకుంఠం వరకు మొత్తం 160 సీసీటీవీ కెమెరాల ఫుటేజీను పరిశీలించారు. వాటి ఆధారంగా శ్రీవైకుంఠానికి చెందిన 30 ఏళ్ల ఇసాక్కి పాండియన్, ముకూడల్‌కు చెందిన 28 ఏళ్ల మురుగన్ ఈ ఘటనలో పాల్గొన్నట్లు గుర్తించారు.

నిందితుల కోసం శ్రీవైకుంఠంలో పోలీసులు గాలింపు చేపట్టారు. ఆ సమయంలో వారు శ్రీవైకుంఠం నుంచి కన్యాకుమారికి ప్రయాణిస్తున్నట్లు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోలీసులు గుర్తించారు. దీంతో ప్రత్యేక పోలీసు బృందం వారిని వెంబడించింది. ఎరుంబుక్కాడు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు ఇసాక్కి పాండియన్, మురుగన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మరో ఇద్దరి ప్రమేయం గురించి సమాచారం లభించినట్లు పోలీసులు తెలిపారు.

'దొంగతనం చేయలేరు' అంటూ సవాల్

పోలీసుల విచారణలో నిందితులు ,సోషల్ మీడియాలో మధుమిత చేసిన ఓ వీడియోను చూసిన తర్వాతే చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. ఇటీవల ఓ వీడియోలో మధుమిత తన ఇంట్లో దొంగతనం చేయడం సాధ్యం కాదని, డబ్బు, ఆభరణాలన్నీ బ్యాంక్ లాకర్‌లో ఉన్నాయని సవాల్ చేసినట్లు నిందితులు తెలిపారు. ఈ వ్యాఖ్యలను దొంగలు ఒక సవాలుగా తీసుకున్నారని పోలీసులు వెల్లడించారు. నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా అలన్‌కులం ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల మురుగేశన్, 39 ఏళ్ల తంగపాండిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 98 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి బరువు సుమారు 784 గ్రాములు ఉంటుందని పోలీసులు తెలిపారు. మిగిలిన ఆభరణాలు, నగదు గురించి కూడా ఆరా తీస్తున్నారు.

# 13శాతం లోటుతో ముగిసిన నైరుతి రుతుపవనాలు



● 2001 తర్వాత నాలుగో అత్యల్ప వర్షపాతం

**టీ మీడియా, సెప్టెంబర్ 30 , ఢిల్లీ బ్యూరో :**

భారతదేశంలో నైరుతి రుతుపవనాల కాలం (జూన్– సెప్టెంబర్) అధికారికంగా ముగిసింది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం 2026 వర్షాకాలం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అత్యంత నిరాశాజనకంగా ముగిసింది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే ఈసారి వర్షాకాలంలో ఏకంగా 13 శాతం లోటు నమోదైంది. దేశంలో మొత్తం మీద చూస్తే సగటున 87 శాతం మాత్రమే వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఇక ఇది 2001 సంవత్సరం తర్వాత భారతదేశంలో వర్షాకాలాల్లో నమోదైన నాలుగో అత్యల్ప వర్షపాతంగా నిలిచింది. లాంగ్ పీరియడ్ యావరేజ్ ఆధారంగా 1971–2000 మధ్య కాలంలో సాధారణ వర్షపాతం 868.6 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది గణనీయంగా తగ్గుదల నమోదైంది.

'పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో వాతావరణ పరిస్థితులు దేశవ్యాప్తంగా వర్షపాతాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ పరిస్థితి అక్టోబర్– డిసెంబర్ కాలంలో కూడా 100 శాతం కొనసాగే అవకాశం ఉంది. ఇంకా ఇది 2027 మార్చి వరకు ముగిసే సూచనలు కనిపించడం లేదు.

'-భారత వాతావరణ శాఖ ప్రకటన

తీవ్ర వర్షపాత లోటు– 282 జిల్లాల్లో కరువు ఛాయలు

దేశంలోని అన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు ఒకేలా లేవు. ఇక్కడ ఈసారి తీవ్ర అసమాన పరిస్థితులు కనిపించాయి. దేశవ్యాప్తంగా మొత్తం జిల్లాల్లో 38 శాతం అంటే ఏకంగా 282 జిల్లాలు తీవ్ర వర్షపాత లోటును ఎదుర్కొన్నాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో కొన్ని రోజుల వ్యవధిలో కూడా భారీ వ్యత్యాసాలు కనిపించాయి. జులై 8తో ముగిసిన వారంలో సాధారణం కంటే 45.4 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, ఆ మరుసటి వారమే ఏకంగా 51.1 శాతం లోటు కనిపించింది. ఇక్కడ వారంలోనే పరిస్థితులు తలకిందులయ్యాయన్నమాట. ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు దాదాపుగా ముఖం చాటేశాయి. సెప్టెంబర్ రెండో వారంలో కూడా 36.3 శాతం లోటు వర్షపాతమే నమోదైంది. ఆఖరి వారంలో మళ్లీ అనూహ్య రీతిలో 49 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. ప్రాంతాల వారీగా, నెలల వారీగా వర్షపాతంలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు స్పష్టమైంది.